# కాలిన పేగు

నరసయ్య పాలిపోయిన మొగంతో, కాళ్ళీడ్చుకుంటూ పొగాకు కంపెనీవైపు నడిచాడు, అక్కడ పనిచేసే రామచంద్రరావును కలుసుకుందామని. నెలరోజులైనా, నరసయ్య పనిచేసే సిమెంటు కంపెనీలో సమ్మె సాగుతూనేవుంది. నెల రోజులనుంచి సమ్మె చేయడంవల్ల కూలిదొరక్క తిండి కరువై పోయింది. కూలీల జీతాలు హెచ్చించడానికి జరిపే సమ్మె నరసయ్యకు మొదటిరోజులలో సబబుగానే కనిపించింది. కాని దినాలు గడిచినకొలదీ, సమ్మెకు అంతం కనిపించకపోడం యింట్లో గింజలు కరువైపోడం, ఒక్కగాని ఒక్క ఐదేండ్ల కూతురు బుల్లెమ్మ ఆకలి నీరసంతో మంచంపట్టడం, నరసయ్య మనస్సులో బాధకలిగించింది. ఏంచేయాలో తోచక పొగాకు కంపెనీవేపు నడిచాడు, ఏదైనా కూలి చూసుకుందామని అందులో.

రామచంద్రరావును నరసయ్య బాగా ఎరుగును. తన కంపెనీలో కూలి సంఘానికి మొదట నాయకుడుగా ఉండేవాడు. తమ కష్టాలు గట్టెక్కించాలని చాలా ప్రయత్నం చేసేవాడు. ఒకరోజున హఠాత్తుగా కూలి సంఘాన్ని వదిలేసి ప్రక్కనున్న పొగాకు కంపెనీలో లేబరు ఆఫీసరుగా జేరాడు. కూలీలకోసం ఎంతో కష్టపడే రామచంద్రరావు ఒక్కసారి కూలీసంఘాన్ని వదిలేసి, పొగాకు కంపెనీలో వుద్యోగంలో ఎందుకు జేరాడో నరసయ్యకు ఇప్పటికీ అర్థంకాలేదు.

అప్పు డప్పుడు రామచంద్రరావు, కూలి సంఘానికి చందాలు కావాలంటూ తనదగ్గరకు వచ్చేవాడు. తనంటే చాలా అభిమానంగా మాట్లాడి అన్ని కష్టసుఖాలు విచారించి సానుభూతి చూపేవాడు. ఆ పరిచయంలో నరసయ్య ఆయన్ని కలుసుకుందామని పొగాకు కంపెనీవైపు నడిచాడు.

మాసినలాగూ, వేళ్ళాడే లాల్చీ చెదిరిన జుట్టుతో నిత్యమూ (మునుపు) ప్రత్యక్షమయ్యే రామచంద్రరావు, పొగాకు కంపెనీ ఆఫీసులో, చక్కటి సూటు తొడుక్కొని, క్రాఫింగు దువ్వుకుని ముస్తాబై నీటుగా కాగితాలు చూసుకుంటున్నాడు. నరసయ్య మెల్లిగా బెదురుతూ ఎదురుగా వెళ్ళి నుంచున్నాడు.

"బాబుగారికి నమస్కారం" చేతులు జోడించి, తల వంచాడు నరసయ్య.

నీశైన కళ్ళజోళ్ళలోంచి ఒక సూశైనచూపు చూశాడు రామచంద్రరావు. నువ్వెవరవో నాకు తెలియదన్నట్లు మొహంలో నిరసనతో కూడి చికాకు వెల్రగక్కింది.

"నేను నరసయ్యను బాబు, సిమెంటు కంపెనీలో పని చేసే కూలీని" అన్నాడు దీనంగా నరసయ్య.

"అయితే"? అన్నాడు రామచంద్రరావు కనుబొమలు చిట్లిస్తూ.

"మీకు తెలియందేముంది బాబయ్యా. నెలరోజుల నుంచి అక్కడ సమ్మె జరుగుతోంది. మా కూలోళ్ళకు యిప్పుడు తిండిలేదు. మమ్మలిని సిమెంటు కంపెనీలోకి వెళ్ళ

నీయడంలేదు మా సంఘందొర వీరాస్వామి. మీ కంపెనీలో ఏదైనా కూలీ యిప్పించండి బాబయ్యా!" అన్నాడు నరసయ్య దిగులు కంఠంతో.

"యిక్కడ ఉద్యోగాలేమీ తేరగాలేవు, వెళ్ళు అవతలికి" అన్నాడు రామచంద్రరావు విసుక్కుంటూ.

"తమరు దయచూపాలి" అని బ్రతిమాలాడు నరసయ్య.

రామచంద్రరావుకు ఒళ్ళుమండింది. మీకందరికీ సమ్మె చేయడం ఉద్యోగాలు వెతుక్కోడం పనిలాగుంది, సమ్మె ఎవరు చేయమన్నారోయి! చేసి, ఉన్న ఉద్యోగం ఎవడు వదులుకోమన్నాడు ? అని కసిరాడు రామచంద్రరావు.

నరసయ్యకు రామచంద్రరావుగారి ప్రవర్తన అంత కరుకుగా ఉంటుందనుకోలేదు. మునుపు చందాలకోసం అప్పుడప్పుడు సమ్మెయి చేయమని తనముందు గంటలతరబడి తియ్యని ఉపన్యాసాలు యీ రామచంద్రరావేనా యిచ్చినది అని సందేహం కలిగింది నరసయ్యకు.

నరసయ్య బాధతో ఏదో యింకా మాట్లాడబోయాడు. మాటలు అతని నోటినుంచి రాకముందే, రామచంద్రరావు "ప్యూన్" అని కేకవేయడం, ప్యూన్ వచ్చి నరసయ్యను గదిలోనుంచి గెంటివెయ్యడం ఒక్కసారి జరిగాయి.

రెండు మూడు రోజులనుంచి ఎన్నోచోట్ల తిరిగినా నరసయ్యకు కూలి ఎక్కడా దొరకలేదు. రామచంద్రరావుమీద గంపెడాశ పెట్టుకునివచ్చి కలుసుకున్నాడు. కాని దాని ఫలితము యిలా పరిణమిస్తుందనుకోలేదు.

ఇంటిదగ్గర కాళీకుండలు, నులకమంచంమీద ఆకలి నీరసంలో, మంచినీళ్ళు త్రాగుతూ కళ్ళు దించుకుపోయిన కూతురూ, పొయ్యిముందర నీళ్ళుకారుస్తూ దుఃఖిస్తున్న భార్య కళ్ళముందు తిరిగాయి. భార్య, కూతురు, తనూ ఎంతకాలం ఆకలితో కృశించడం? యీ సమ్మెకు అంతం ఎప్పుడువస్తుంది? డబ్బున్నవాడు కాబట్టి తమ కూలిసంఘం నాయకుడు వీరాస్వామికి యీ ఆకలిగొడవ తెలియదు, అక్కడికీ నోరువిప్పి యింట్లో గింజలకి ఏమన్నా సహాయం చేయమని నరసయ్య అడిగితే, ఎంతమందికని సహాయం చెయ్యను ?" అని విసుక్కున్నాడు—వీరాస్వామి. కాని ఎంతమంది కూలీలకు సహాయం చేస్తున్నాడో తెలియదు. తనెరుగున్న ఆగుడిసెలోని ఆ కూలివాళ్ళంతా తిండికోసం అలమటిస్తోన్నవాళ్ళే, కూలిపోవడవల్ల! అని విచారించేడు నరసయ్య.

సమ్మె మొదలెట్టినప్పటినుంచి తిండిసరిగా లేకపోవడం వల్ల నరసయ్యకుకూడ నీరసం ఎక్కువై, కళ్ళు చీకట్లు కమ్మాయి. తన కష్టాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఒకమూల కూర్చుని దూరంగా ఎక్కడైనా ఏడ్వాలనిపించింది అతనికి. పది అడుగులువేశాడు. నీరసం మరీ ఎక్కువయింది. మిట్ట మధ్యాహ్నపుఎండ నరసయ్య శరీరాన్ని కాలుస్తూంది ఇంక నడవలేక ఆ వీధిలో ఒక తూముపైన కూర్చున్నాడు.

ఆకలి నీరసం, కష్టాలబాధలు హృదయాన్ని కుదిరిచి, కన్నీరు ఉబికించింది. నరసయ్య కంటినుంచి వేడి బాష్పాలు జలజల రాలాయి. అతని కన్నీటి చుక్కలు ఆ తూముక్రింద రాలి టపటప శబ్దం వినిపించింది.

నరసయ్యా తాను కూర్చున్న తూముకిందకు చూశాడు. ఒక భికారివాని శవం కనిపించింది. తన వేడికన్నీళ్ళు ఆ శవం నిడుగుడ్లకంట్లోపడి శబ్దం కలిగింది.

నరసయ్యాకు దుఃఖం ముంచుకువచ్చింది. తన గతికూడా ఎప్పుడైనా ఆ శవం రీతిగా ఐపోతుందేమోనని, ఆ శవం ఆకారం చూడగానే తెలిసింది. అదెవడిదో ముష్టివాడిదని. అతను తిండిలేక, ఆకలిబాధతో, యీ తూముప్రక్క కాలం గడుపుతూ కళ్ళుమూసి ఉండవచ్చునని నరసయ్యా అనుకున్నాడు.

ఆకలిబాధతో చచ్చిన ఆ శవంవైపు జాలిగా చూశాడు నరసయ్యా. ఆ శవం తన జీవచ్ఛవానికి ఎంతో సహాయం చేయగలదేమో అని అనిపించింది నరసయ్యాకు. బ్రతికిఉన్న మానవ హృదయాలు కనికరంతో స్పదించకపోయినా, ఆ పడిఉన్న శవంలో ఏదో కనికరం కదిలినట్లనిపించింది అతనికి. యీ శవం తన కుటుంబం ఆకలి తీర్చగలదనుకున్నాడు నరసయ్యా.

దుమ్ముధూళిలో పూడ్చుకుపోయిన ఆ శవాన్ని తూము రోడ్డుపైకిలాగి తనపైనున్న తలపాగావిప్పి కప్పాడు, నరసయ్యా. రోడ్డుమీాద జనం నడుస్తూనే ఉన్నారు. ఎవరికీ ఆ శవం గురించికాని, నరసయ్యా స్థితిగురించిగాని ఆలోచనేలేక, తమ స్వంత ఆలోచనల తలదిమ్ముతో నడిచి పోతున్నారు.

మోకాలుదాకా పంచె ఎగకట్టి దీనమ్తైన మొగంపెట్టి. లేనిశక్తి తెచ్చుకుని అరిచాడు నరసయ్యా.

"బాబులు, బాబులు మా వీరిగాడు చచ్చిపోయాడు. దయచూపండి బాబయ్యా. ఏదైనా యిప్పించండిబాబూ!

వీడికి నిప్పుచేయాలి బాబయ్యా!" అంటూ దోసిలిచేసి, వచ్చే, వెళ్ళే జనంతో మొఱపెట్టాడు.

జనం కదులుతున్నారు. నరసయ్య ఆక్రందనలు ప్రతిధ్వనిస్తున్నాయి. "బాబులు! బాబులు! మా పీరిగాడికి నిప్పు చేయాలి."

నడిచేజనంలో కనికరం కదిలింది. పాపం, ఎవడో ముష్టివాడు చచ్చిపోయాడుకాబోలు అనుకున్నారు అంతా, వచ్చే, వెళ్ళేవాళ్ళు నరసయ్య దోసిలో తోచిన పైసలువేశారు.

అరగంట గడిచింది. జనం రకరకాల గుంపులుగా మారిపోతున్నారు. నరసయ్య దోసిలి నిండింది, వీధిలోని జనం కరుణతో రాల్చిన పైసలతో.

నరసయ్య కళ్ళుమెరిసాయి, దోసిలోని పైసలు చూచేసరికి. ఆకలితో చచ్చినశవం తన ఆకలి తప్పక తీర్చిందని సంతోషించాడు. ప్రక్కకువెళ్ళి లెక్కపెట్టాడు పైసలు, పదిరూపాయలు పోగయ్యాయి.

శవంమీది కండువా తీసుకుని తలకు కట్టుకున్నాడు. శవాన్ని మునుపటి ప్రదేశంలో దుమ్ముధూళిలోకి యీడ్చేశాడు నరసయ్య.

జనప్రవాహం పల్చబడింది. నరసయ్య ప్రక్కవీధిలోకి మళ్లి శవంనుంచి మాయమయ్యాడు.

నడుస్తూంటే వీధిలో పకోడీలు అమ్మేకోమటి కనుపించాడు. నాల్గణాలు పొట్లాలు కట్టించాడు. వీధిలో అమ్మే

గాలిబూరాలు రెండుకొన్నాడు, తన కూతురు ఆడుకుంటుం దని. అంగడికిపోయి గింజలు కూరలుకొని మూటలుకట్టాడు. ఒకచిన్న పర్సు కొనుక్కొని మిగిలిన బరువైన చిల్లర దాచు కొని మొలలోకి దోపాడు.

పట్నం చివరవున్న తన పేటవైపు త్వరగా పోదామని బస్సు ఎక్కాడు. మెత్తటి సీటుమీద కూర్చున్నాడు మూటలు ప్రక్కన పెట్టుకుని.

బస్సు వేగంగా నడిచిపోయింది. తను తెచ్చిన డబ్బు, కూరలు, గింజలు అన్నీచూసి తనభార్య సంతోషిస్తుంది. తన కూతురు మంచంమీదనుంచి లేచి గబుక్కున తన దగ్గరికివచ్చి గాలిబూరాలు లాక్కుంటుంద, కుండలనిండా అన్నం వండు కుని, కడుపునిండా యీరాత్రి భోంచేస్తామని ఏవో ఏవో ఆలోచనలో ఊగులాడాడు నరసయ్య.

తన పేటకు దగ్గరగా బస్సు ఆగింది. నరసయ్య మూట లతో లేచి బస్సుదిగి పేటవైపు నడిచాడు. తన గుడిశెదగ్గరకు రాగానే తన యింటిప్రక్క యీరిగాడు పలకరించాడు. "ఏటిరా నరసయ్యా! యీ సామానంత ఎక్కడదిరోయి" అని ఆశ్చర్యంచూపాడు యీరిగాడు. "పట్నంలో ఏదో కూలి చేసుకుని కొన్నారా యీ గింజలు అవీనీ" అన్నాడు నర సయ్య. సమ్మెవల్ల ఆకలితో మాడుతున్న యీరిగాడు యివన్నీ చూసి, లోపల యీర్ష్యపడ్డాడు.

గుడిశెలోకి వెడుతూంటే, నరసయ్య బుజంమీదవున్న రబ్బరు బూరాలు, గుడిశె కమ్మకు తగిలి టప్పుమంటూ పేలి

పోయాయి. నరసయ్యకు మనస్సు చివుక్కుమంది. కష్టపడి కూతురుకోసం తెచ్చిన ఆటవస్తువులు గుమ్మంలోనే పగిలి పోవడం ఏదో అపశకునంలా తోచింది. గుడిసె చూరుదాటి గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికి పెళ్ళాం ఏడుపు వినిపించింది. గుడిసెలో జనం మూగి ఉన్నారు. కంగారుగా లోపలికి నడిచాడు నరసయ్య.

నులక మంచంమీద కూతురు నురగలు కక్కుతూ కనిపించింది. మొగం, ఒళ్ళు నల్లబడి మాడిపోయినట్లు కనిపించాయి. పెళ్ళం అతన్ని చూడగానే గొల్లుమని గోలెత్తుతూ "బుల్లెప్పను తాచు కరచింది, చచ్చిపోయింది." అంటూ గుండెలు బాదుకుంది.

నరసయ్య యీ దృశ్యం చూసేసరికి నిలువునా, నీరై పోయాడు. కళ్ళముందు రబ్బరు బూరాలు టప్పున చిరిగి పోయిన దృశ్యం కనిపించింది. మూటలు క్రిందపారేసి చంటిపిల్ల వాడిలా ఏడ్చాడు నరసయ్య.

ఏడ్పులలో ఆగుడిసె గంటసేపు గింగురుమంది. పక్క గుడిసెలలో కూలివాళ్ళు నరసయ్యను జేరి, "ఏం నరసయ్యా, ఎంతసేపు ఏడవడం ఆ పిల్లకు కాస్త నిప్పుచెయ్యి యింక" అన్నారు ముందు సంగతి గుర్తుకుతెస్తూ.

తప్పని సరిగా కళ్ళుతుడుచుకుని గుండె రాయిచేసుకుని మిగిలిన చిల్లర సైసలతో ఉన్న పర్సుకోసం మొలవెతికాడు. పర్సు కనిపించలేదు నరసయ్యకు. ఒక్క నిట్టూర్పు విడిచాడు బస్సులో పర్సుపోయిందేమో అని.

పిల్లకు నిప్పచేయడానికి ఏం చేయాలో అర్థంకాలేదు నరసయ్యకు. ఉబికివచ్చే బాధలో ఒక్కసారి కళ్ళు మూసు కున్నాడు దుఃఖిద్దామని. తన పేట చివరఉన్న కోమటి రంగయ్య తనకూరలు, గింజలుకట్టిన మూటలు తీసుకుని, చేతులో చిల్లర వేసినట్లు కనిపించింది ఆ మూసుకున్న కళ్ళ ముందు.

కళ్ళు తెరిచి, చనిపోయిన కూతురు శవంచూసి గట్టిగా వెక్కి వెక్కి ఏడ్చాడు, నరసయ్య, వీధిలో శవం నిప్పుకు సేక రించిన సొమ్ము, కూతురు శవం నిప్పుకు చివరకు ఉపయోగించ వలసి వచ్చిందని మూటలు పట్టుకుని ఆకలి నీరసంతో కోమటి రంగయ్య దుకాణావైపు నడిచాడు నరసయ్య. దారిలో సమ్మెవల్ల మూసుకుపోయిన తన సిమెంటు కంపెనీ అంతా ఖాళీగా బిగుతు బిగుతుమంటూ కనిపించింది.